# 2

# జీవముతో కూడిన నిరీక్షణయందు ఆనందించుడి (1 పేతురు 1:3-12)

హేతువు తెలివిగలవానిని నిరీక్షణ కలిగియుండుమని చెప్పినందున జ్ఞానముగలవాడు నిరీక్షణ కలిగియుంటాడు. భవిష్యత్తు మంచిదిగా ఉంటుంది అన్న నమ్మకం కలిగియుండడానికి హేతువున్నప్పుడు మనం ఇబ్బందులను సహించగలము. అటువంటి తెలివైన నిరీక్షణనే పేతురు తన పత్రికను చదువు వారి ముందుంచాడు.

### క్రీస్తు జీవించుచున్నాడు గనుక నిరీక్షణ జీవించుచున్నది (1:3-5)

నూతనంగా క్రీస్తులోనికి వచ్చి, అప్పుడే ఆయన నామాన్ని బట్టి భారమును భరించుటకు పిలువబడిన వారికి ఒక ఆత్మీయ నాయకుడు ఏమి చెప్పగలడు? ధన్యమైన నిరీక్షణను ఆనందముతో చూస్తూ వారు ఒక నూతన జీవితాన్నే ప్రారంభించారు, అయితే వారు పొరుగువారిచే తొలగింపబడి, అధికారులచే వేటాడబడి, జీవితం యొక్క ప్రతి అవసరాలను నిరాకరించవలయునన్న విషయములను లెక్క చూసుకొన్నవారు కారు. పేతురు నిరీక్షణ కలిగియుండుడి అని బ్రతిమాలుకొన్నాడు. ఈ పదాన్ని 1వ అధ్యాయములో 3 సార్లు ఉపయోగించాడు (3, 13, 21 వచనాలు). మరియు మరి రెండుసార్లు 3వ అధ్యాయంలో ఉపయోగించాడు (5, 15 వచనాలు). 1 పేతురు పత్రిక "నిరీక్షణ పత్రికగా" పిలువబడింది మరియు పేతురు, "నిరీక్షణ అపొస్తలుడుగా" పిలువబడ్డాడు. క్రొత్త నిబంధనలోని యితర రచయితలకంటె పేతురు నిరీక్షణను గురించి ఎక్కువ తరుచుగా విజ్ఞప్తి చేసాడని చెప్పడం కష్టమైనది. ఉదాహరణకు పౌలు, నిరీక్షణ అనే మాటను రోమీయులకు వ్రాసిన పత్రికలో దాదాపు 15 సార్లు ఉపయోగించాడు (5, 8, మరియు 12). అటువంటి సమయంలో 1 పేతురును "నిరీక్షణ పత్రిక" అని అనడం అతిశయోక్తి అవుతుంది. కాని 1వ అధ్యాయంలోని సందేశములో నిరీక్షణ నిక్షిప్తమైయుంది అనటంలో ఎటువంటి సందేహము లేదు. క్రైస్తవుల నిరీక్షణ కడవరి కాలముతో, ప్రభువు ప్రత్యక్షతతో చాలా బలంగా ముడివేయబడి ఉంది. అంతేకాదు, అన్నింటి అంతముతో ముడివేయబడియుంది (1:5, 7, 9, 13).

పేతురు పత్రికను చదువు వారికి క్రీస్తు మృతులలోనుండి లేచియున్నాడని తెలుసు. జీవముతో కూడిన నిరీక్షణలోనికి వారు నూతనంగా జన్మించారు – జీవముగల ప్రభువుగా క్రీస్తు పరిపాలన చేయుచున్నాడు గనుక (1:3, 21).

ఎవరు యిట్టి జీవముతో కూడిన నిరీక్షణలో పాలుపొందుదురు? ఎవరైతే "మరల జన్మించుతారో" వారు దీనిలో పాలుపొందుదురు అని పేతురు చెప్పాడు (1:3). KJVలో, "దేవుడు మనలను మరలా కనియున్నాడు" అని తెలియజేస్తే NIVలో, "ఆయన మనకు నూతన జన్మనిచ్చాడు" అని వ్రాయబడి ఉంది. క్రీస్తు నీకొదేముతో 35 సంవత్సరాల పూర్వము చెప్పిన మాటను పేతురు చెప్పాడు. దానికంటె ఎక్కువ ఏమి చెప్పలేదు. నీటిమూలముగాను,

ఆత్మ మూలముగాను, జన్మించినప్పుడు జీవముతోకూడిన నిరీక్షణ కలుగుతుంది (యోహాను 3:5). "నీటిమూలముగా, ఆత్మమూలముగా జన్మించుట" బాప్తిస్మమునకు సంబంధించిన ఉల్లేఖనం. బాప్తిస్మమందు ప్రభువుతో కలుసుకొని లేచినప్పుడు జీవముతో కూడిన నిరీక్షణలో పాలుపొందుటకు ఒకడు నూతనముగా జన్మించాడు. ఎప్పుడైతే ఒకడు నీటిలో బాప్తిస్మమందు క్రీస్తు రక్తముతో కలుసుకొంటాడో అప్పుడతడు "శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా" మరల జన్మిస్తాడు (1:23).

క్రైస్తవులు తమ దృష్టిని నిలిపిన జీవముతో కూడిన నిరీక్షణ ఏది? అది అక్షయమైన, నిర్మలమైన, ఎన్నటికి వాడిపోనట్టి పరలోక స్వాస్థ్యము అని పేతురు తెలియజేసాడు (1:4). "స్వాస్థ్యము" అని తర్జుమాచేయబడిన గ్రీకు పదమునకు, ఒకని భాగమును లేక వంతును అంగీకరించుటతో సంబంధము కలిగియుంది. క్రైస్తవుల భాగము వారసునికి యిచ్చులాంటిదే. గలతీయులకు వ్రాసిన పత్రిక 4:1–7నందు పౌలు కుమారునికి, దాసునికి మధ్య చాలా వ్యత్యాసాన్ని కనపరచాడు. క్రీస్తునందు ఒకడు స్వాస్థ్యములో మొత్తము భాగమును సంపూర్ణముగా అనుభవించగలడు, ఇట్టిది దేవుడే తన కుమారులు కుమార్తెలకు అప్పగించుచున్నాడు, లేదా పంచియిస్తున్నాడు.

బహుశ, పరలోకంలో భాగము అనే ఆలోచన యొక్క అర్థం మనకంటే పేతురు యొక్క పత్రిక చదువరులకే ఎక్కువ అర్థవంతంగా ఉండును. ఎక్కువ పెరుగుచున్న వైద్య ఖర్చులను గూర్చి, లేదా యితరులను మెప్పించుటకు ఒక సౌండ్ సిస్టమ్‌ను అమర్చడానికి చేసే ఆలోచనలకంటె ప్రభువు రాకడ, పరలోకమును స్వాస్థ్యముగా పొందుట అనేవి తక్కువ ఆకర్షణీయంగా ఉన్నాయి. నేడు పురుషుడు కానీ, స్త్రీ కానీ వారు పొందిన మనోదృక్పథము అతనిని లేదా ఆమెను వాగ్దానము చేయబడ్డ పరలోకము నెరవేర్చబడేంత వరకు చాలాకాలం వేచియుండులాగున చేయునా? పేతురు ఒక సమాధానాన్ని యిచ్చాడు: "కడవరి కాలమందు బయలుపరచబడుటకు సిద్ధముగానున్న రక్షణ" (1:5), "యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును, మహిమయు ఘనతయు కలుగును" (1:7), "యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు తేబడు కృప విషయమై సంపూర్ణ నిరీక్షణ కలిగియుండుడి" (1:13) అనువాటిని గూర్చిన దృష్టికోణము ప్రతి విజయం, అపజయం, లక్ష్యము, సంతోషము, జీవం యొక్క దుఃఖమును వర్ణించును. అంతమును గూర్చిన ఆలోచన ఈ లోకములో లంగరు వేయబడిన ప్రతి హృదయమును స్పష్టపరుచును.

### దుఃఖమందు ఆనందం జీవించుచున్నది (1:6–9)

విశ్వాసము కొరకు శ్రమపడుచున్న క్రైస్తవులకు పేతురు ఏమి చెప్పగలడు? నిరీక్షణ కొరకు విజ్ఞప్తి చేయడం స్వాభావికమైనప్పుడు, ఆనందము పొందుటకు కష్టమగును. ఏది ఏమైనప్పటికి, క్రీస్తునందు వారి ఆనందమునకు ఆటంకము లేదని పేతురు జ్ఞాపకం చేసాడు. KJVలోని తర్జుమా పునరుక్తమని కనిపించినా, అది గ్రీకును బాగుగా వ్యక్తపరుస్తున్నది: "చెప్ప నశక్యమును మహిమా యుక్తమునైన సంతోషముగలవారై ఆనందుంచుచున్నారు" (1:9). ఈ వాక్యభాగము, తర్జుమా కంటె గ్రీకులో ఎక్కువగా ఉన్నది, క్రియా విశేషణమును కలిగియున్నది. ఈ ఆనందమంతా దేనినిగూర్చి? "దేవుని కుమారుడు మిమ్ములను ప్రేమిస్తున్నాడు, మరియు మీరు ఆయనను ప్రేమించుటకై వచ్చారు. ఆయన మిమ్ములను ప్రతి పాపమునుండి విడిపించుటకై

తన ప్రాణమును పెట్టాడు. యిప్పుడు కూడ, మీరు శ్రమ పొందుచుండగా, మీ విశ్వాసమునకు ఫలమును, అనగా ఆత్మరక్షణను పొందుచు, చెప్ప నశక్యమును మహిమా యుక్తమునైన సంతోషముగలవారై ఆనందించుచున్నారు" అని పేతురు సారాంశమును చెప్పాడు.

క్రీస్తు నిస్సందేహముగా ఈ లోకములో సాధ్యమైన మంచి జీవితాలను యిచ్చును. కానీ ఆయన ఒక రకంగా మన మనస్సులను నిత్యత్వము వైపు మళ్ళించుట ద్వారా దీనిని చేయుచున్నాడు. 1 పేతురును చదువుచుండగా, అపొస్తలుడు ఎల్లప్పుడు నిత్యత్వమును తన కన్నుల యెదుటయే నిలుపుకొనియున్నాడు అనే ఆలోచననుండి తప్పించుకొనలేము. "మీరు ఆయనను కన్నులార చూచినవారు కారని" పేతురు చెప్పుచున్నాడు, "ఆయనను విశ్వసించుచు, మరియు విశ్వాసమువలన ఆత్మ రక్షణను పొందియున్నారు." నిత్యత్వము అనేక సంగతులను మనముందు ఉంచగలదు: దర్శన దినమును (2:12), క్రీస్తు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండుటను (3:22), సజీవులకు, మృతులకు తీర్పు తీర్చుటకై క్రీస్తు సిద్ధముగా ఉండుటను (4:5), అన్నింటి అంతము సమీపమైయుండుటను (4:7), క్రీస్తు మహిమ బయలుపరచబడుటను (4:13), ప్రధాన కాపరి ప్రత్యక్షమగుటను (5:4). ఎప్పుడైతే నిత్యత్వముపై మనం దృష్టినిసారిస్తామో అప్పుడు లోకము దానిలోని జయాపజయాలన్ని పాలిపోయినవి. క్రీస్తుని ఎరుగుట నూతనపరచబడుటయగును. జీవితం పై ఒక నూతన దృక్పథాన్ని అనుగ్రహిస్తున్నాడు, అది నిరాశమయ ప్రదేశమును ఆనందముతో పొంగిపొర్లు దృక్పథము.

### ప్రవక్తల పరిచర్య ద్వారా ప్రోత్సాహము జీవించుచున్నది (1:10-12)

పేతురు క్రీస్తు జననం, జీవితం, ఆయన బోధనలను గూర్చి వ్రాసిన ప్రవక్తల గూర్చి ఆయన పత్రిక చదువు వారికి తెలియచేస్తున్నాడు. వారి పరిచర్య సర్వత్రా వ్యాపించిన క్రొత్త నిబంధన సాక్ష్యము. యేసు లూకా 24:27లో మాట్లాడిన ఉద్దేశముతోనే పేతురు పాత నిబంధన సాక్షమును సూచిస్తున్నాడు, కానీ వేరొక అవకాశం కూడా లేకపోలేదు. పాత నిబంధన ప్రవక్తలు పేతురు మనస్సులో ఉన్నప్పటికి, తాను యివ్వబోవుచున్న స్వాస్థ్యము కొరకు ఎన్నుకొనుటకు, మరియు తన ప్రజలను సిద్ధపరచుటకు దేవుడు తన రాయబారులను పంపెను. పేతురు పత్రిక చదువరులు, దుష్టుల నిందలను సహించులాగున సిద్ధపరచు విషయంలో ప్రవక్తలు సహాయం చేసిరి. దేవుని ఉద్దేశ పూర్వకమైన ఆశీర్వాదములు స్వీకరించుటకు నూతనముగా జన్మించినవారు - సంపూర్ణమైన మహిమతో పరలోకమునుండి పంపబడిన పరిశుద్ధాత్మ ద్వారా ప్రకటింపబడిన అశీర్వాదమిది.

### ముగింపు

పేతురు మాటలు క్రైస్తవులకు ఒక గొప్ప పునాదిని వేసి, వారి గొప్ప విశ్వాసపు మూలాధారములను జ్ఞాపకము చేసుకొనెలా వారిని పురికొల్పినవి. క్రీస్తు పునరుత్థానము ద్వారా ఏ సజీవమైన నిరీక్షణ కొరకు పిలువబడిరో అది వారి శ్రమలన్నింటికి బదులుగా చెల్లించుటకంటె అధికమైనదైయుంది. నిరీక్షణ మరియు వాగ్దానము వారి సంతోషానికి హేతువును అనుగ్రహించుచున్నది. ఈ సంతోషమును లోక అవరోధములు తుడిచివేయలేవు. అన్నింటికంటె ఎక్కువగా, వారికి ప్రవక్తలు పరిచర్య చేసిరని పేతురు జ్ఞాపకం చేస్తున్నాడు. వారు దేవుని ఉద్దేశపూర్వకపు నిత్యత్వానికి వారసులని తెలియచేసాడు. పేతురు తన

సందేశాన్ని రెండు వేల సంవత్సరాల క్రితం వ్రాసాడు. అయినప్పటికి నేటికీ అది దేవుని ప్రజలను పురికొల్పుతుంది. మహిమ మరియు నిరీక్షణ వెలుగులో క్రైస్తవుడు ఎదుర్కొంటున్న వ్యతిరేఖత చాలా తక్కువ ప్రభావంగలది. పేతురు చెప్పవలసింది ఈ పత్రికలో చాలా ఉంది కానీ దానినంతయు క్రీస్తులో ఉండుట ద్వారా వచ్చు ఆనందము యొక్క వెలుగులో అర్థం చేసుకోవలెను.